విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిశోధక విద్యార్థులు

ఆర్ఎస్పీపై అనుచిత వ్యాఖ్యలు సహించం

ఉస్మానియా వర్సిటీ పరిశోధక విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 29: గురుకుల విద్యాలయాలను సమున్నత స్థాయికి తీసుకెళ్లిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలను సహించేది లేదని ఓయూ పరిశోధక విద్యార్థులు హెచ్చరించారు. గురుకుల విద్యాసంస్థల కార్యదర్శిగా ఆ పాఠశాలలను ప్రపంచస్థాయికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పరిశోధక విద్యార్థి పాల అలెగ్జాండర్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రంలో నాటి సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వందల సంఖ్యలో గురుకులాలను ప్రారంభించినట్టు తెలిపారు. కార్పొరేట్‌ను తలదన్నేలా గురుకులాల అభివృద్ధికి ఆర్ఎస్పీ నిరంతరం శ్రమించారని కొనియాడారు. విలువలు తెలియని మానవతారాయ్ లాంటి వ్యక్తికి ఆర్ఎస్పీ గురించి మాట్లాడే నైతికహక్కు లేదని విమర్శించారు. ఊసరవెల్లిలా రంగులు మార్చినట్టు, అధికారం కోసం మానవతా రాయ్ పార్టీలు మారారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోకపోతే గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రుద్రవరం సునీల్, నవీన్ మొగిలిపాక, అందె అజయ్, సురేశ్, రామ చంద్ర, భాస్కర్, మధు, రాజేశ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌లో ఆర్ఎస్పీ హస్తం

- సెక్రటరీగా ఉన్నప్పటి అనుచరులతో దందా
- ప్రతిపక్ష నేతలపై ఇంటెలిజెన్స్ నిఘా పెట్టాం
- ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే ఎవరినీ వదలం
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సురేఖ

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో జరుగుతున్న వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తం ఉన్నట్టు అనుమానం కలుగుతున్నదని రాష్ట్ర అటవీ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సచివాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాల గురించి ప్రవీణ్ కుమార్‌కు తెలుసని, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ జరిగేలా ఆయనే ప్రణాళికలు రూపొందించినట్టు అనుమానం కలుగుతుందని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సరుకుల సరఫరాలో ప్రవీణ్‌కుమార్ రూ.కోట్లలో కుంభకోణం చేశారని, అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారని గుర్తుచేశారు. ప్రతిపక్ష నేతలు చేసే వ్యాఖ్యలపై ఇంటెలిజెన్స్ నిఘా ఉన్నదని మంత్రి సురేఖ వెల్లడించారు. అన్నింటినీ నమోదు చేసుకొని అందరి లెక్కలూ తేలుస్తామని చెప్పారు. ప్రభుత్వంపై ఆరోపణలు చేసే వారెవరినైనా వదిలిపెట్టబోమని స్పష్టంచేశారు. ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గురుకులంలో శైలజ అనే విద్యార్థిని మృతి చెందడంపైనా తమకు అనుమానాలు ఉన్నాయని, సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. శైలజ మృతిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. అధికారం కోల్పోయామనే ఫ్రస్ట్రేషన్‌లో కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు.

సురేఖవి మతిస్థిమితంలేని వ్యాఖ్యలు

- వందల కోట్లు వృథా అని తేలితే నన్ను జైల్లో పెట్టండి!
- బీఆర్ఎస్ గురుకుల బాట ఆగదు
- అది ప్రజాపక్షంగా మా పార్టీ బాధ్యత
- గాంధీభవన్‌లో ఉండి మాట్లాడితే ఎలా?
- నాణ్యమైన విద్య అందించడంలో కేసీఆర్ ప్రభుత్వానిది ప్రపంచ రికార్డు
- విద్యార్థులను చంపడంలో రేవంత్‌రెడ్డి ప్రపంచ రికార్డు
- చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌రెడ్డి బహిరంగ చర్చకు రావాలి
- నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ మాజీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి కొండా సురేఖ గురుకులాల పైనా, వ్యక్తిగతంగా తనపైనా మతిస్థిమితం లేని వ్యాఖ్యలు చేశారని రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ మాజీ కార్యదర్శి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ అంటే బీర్లు, బిర్యానీ ఉండాల్సిందేనని గతంలో వ్యాఖ్యానించిన ఆమె తన చిత్తశుద్ధిని శంకిస్తే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎంత మంది పోలీసులను పెట్టినా బీఆర్ఎస్ చేపట్టిన గురుకుల బాట ఆగబోదని స్పష్టంచేశారు. ఈ నెల 30 (శనివారం) నుంచి చేపట్టనున్న బీఆర్ఎస్ గురుకుల బాట, మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు, ప్రభుత్వ విద్యాలయాల్లో నడుస్తున్న పరిణామాలపై శుక్రవారం ఆయన నమస్తే తెలంగాణకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు. ఆయన ఇంటర్వ్యూ వివరాలు ఇలా ఉన్నాయి.

నమస్తే తెలంగాణ: మంత్రి కొండా సురేఖ మీపై చేసిన ఆరోపణలపై మీ స్పందన ఏమిటి?

ఆర్ఎస్పీ: కొండా సురేఖ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారు. విద్యాలయాల్లో విషాహార సంఘటనలు ఎందుకు జరుగుతున్నయి? వాటి నివారణ చర్యలు తీసుకోకుండా, ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా, పిల్లలలో కలిసి తినకుండా, పాఠశాలలకు వెళ్లకుండా గాంధీభవన్‌లో కూర్చొని అందులో నా కుట్ర ఉన్నదని చెప్పడం ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సమస్యను పక్కదారి పట్టించడమే అవుతుంది. నేను గురుకులాల కార్యదర్శిగా 9 ఏండ్లు పనిచేసిన. అందులో రెండేండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం, ఏడేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం. కేసీఆర్ ప్రోత్సాహంతో గురుకులాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకుపోయిన. ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ అయిన హార్వర్డ్ యూనివర్సిటీలో మన గురుకులాలు కేస్ స్టడీ, వరల్డ్ బ్యాంక్ కేస్ స్టడీ ఎందుకు అయింది. అలాగే దేశంలోని అనేక రాష్ట్రాలకు మన గురుకులాలు మాడల్ ఎందుకయ్యాయి? గురుకుల విద్యార్థుల కోసం చిత్తశుద్ధితో పనిచేసిన. నా కమిట్‌మెంట్ చూసే కేసీఆర్ గురుకుల పాఠశాలల సంఖ్యను గణనీయంగా పెంచారు. విద్యా ప్రమాణాల పెంపులో కేసీఆర్ ప్రభుత్వం ప్రపంచ రికార్డు నెలకొల్పితే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులను చంపడంలో రికార్డును సృష్టిస్తున్నది.

మీరేమో ప్రపంచ రికార్డు అని చెప్తున్నారు. మంత్రులేమో మీరు కుట్రలు చేస్తున్నారని అంటున్నరు. ఉన్నట్టుండి మీ మీద పడ్డారెందుకు?

మమ్మల్నే కాదు మా నీడను కూడా చూసి.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భయపడుతున్నరు. అందుకు రేవంత్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, కవ్వంపల్లి సత్యనారాయణ వంటి వారి మాటలే నిదర్శనం. కేసీఆర్ మార్గదర్శకంలో మేం గురుకులాల బాట నిర్వహిస్తామని కేటీఆర్ చెప్పారు. గురుకులబాట రాజకీయ కోణం లేదని స్పష్టంగా చెప్పారు. ప్రభుత్వ విద్యాలయాల్లో ఏం జరుగుతుంది? అనే విషయాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఏం చేయాలో ప్రభుత్వానికి సూచించే ఒక నిర్మాణాత్మక కార్యక్రమం. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు కాబట్టి మేం తెలుసుకోవాల్సిన అని వార్యత ఏర్పడింది. అర్థవంతమైన చర్చ కోసం, గురుకులబాట అనే కార్యక్రమం అనగానే రేవంత్‌రెడ్డికి ఎందుకు వెన్నులో వణుకు పుడుతున్నది. 48-50 మంది పిల్లలు చనిపోయేదాకా ప్రభుత్వం ఏం చేసినట్టు? అందులో మంత్రులు ఏమి చేసినట్టు? ఒకటే జిల్లాల్లో పదుల సంఖ్యలో సంఘటనలు జరుగుతుంటే... ఒకే హాస్టల్‌లో 10 రోజుల వ్యవధిలో నాలుగైదు ఘటనలు చోటుచేసుకుంటుంటే ఎందుకు పట్టించుకోలేదు. ఒకే స్కూల్‌లో ఇద్దరు పాము కాటుతో ఎట్లా చనిపోతరు? విషాహారం తిని ఒక అమ్మాయి ఎట్లా చనిపోద్ది. నిమ్స్‌లో చావు బతుల కుల మధ్య కొట్టుమిట్టాడుతున్న విద్యార్థినిని ముఖ్య మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా చూసేందుకు రేవంత్‌రెడ్డి ఎందుకు రాలేదు? బాధ్యతాయుత ప్రతిపక్షంగా బీఆర్ఎస్ చేపట్టిన కార్యక్రమాన్ని చూసి వాళ్లకు భయం పట్టుకున్నది. అందులో భాగంగానే నాపైన, కేటీఆర్ పైన విమర్శలు చేస్తున్నరు.

కార్యదర్శిగా ఉన్నప్పుడు వందల కోట్లు వృథా చేశారని అంటున్నారు? దానికి మీరేమంటరు?

నేను వందల కోట్లు వృథాచేస్తే విచారణకు ఆదేశించండి. అవసరమైతే నాపైన సీబీఐ ద్వారా విచారణ చేయించి నన్ను జైలుకు పంపండి. వాళ్ల ప్రభుత్వమే ఉన్నది. ఎవరొద్దన్నరు. నేనొద్దన్నానా? సమస్య మాట్లాడమంటే వ్యక్తిగత విమర్శలకు దిగి సమస్యను పక్కదోవ పట్టించాలనే దురుద్దేశ భావన తప్ప మరోటి కాదు.

బీరు, బిర్యానీలతో పార్టీలు చేసుకుంటున్నారని మీరు మంత్రి కొండా సురేఖపై వ్యాఖ్యలు చేశారు. దీన్నెలా సమర్థించుకుంటరు?

బీర్లు బిర్యానీలు లేకుండా పార్టీలు జరుగుతయా? అని గతంలో కొండా సురేఖ మాట్లాడింది నిజమా? కాదా? కేటీఆర్‌పైన కొండా సురేఖ గతంలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని, ఆమెపైన కేసు నమోదు చేయాలని కోర్టు మొట్టికాయలు వేసిన విషయం అందరికీ తెలిసిందే. అలాంటి కొండా సురేఖకు నా గురించి మాట్లాడే అర్హత ఎక్కడిది? మా పిల్లలకు బీర్లు కాదు.. బుక్కులు కావాలి, కల్లు కాదు కంప్యూటర్లు కావాలి, చెప్పులు కుట్టిన చేతులతోనే చరిత్రను తిరగరాయాలి, డప్పులు కొట్టిన చేతులతోనే డాలర్లు సంపాదించాలి.. అని మేము తిరిగినం.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ముందుపెట్టి బీఆర్ఎస్ దళిత కార్డును వాడుకుంటున్నది. అందుకే కేసీఆర్ మీతో పాదయాత్ర చేయిస్తున్నారని అంటున్నరు?

వాడుకోవటానికి నేనేమైనా సరుకునా. పిల్లల జీవితాలు బాగుపడాలని మేమొక ఉద్యమం చేస్తున్నం. ప్రజారంగంలో ఉన్నాం. మాలో మాకు విభేదాలు సృష్టించేందుకు కాంగ్రెస్ కుట్రల ఎత్తుగడ అది. ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న కుట్ర వారిది. గురుకులాలను రక్షించుకునే బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నం. ఇందులో రాజకీయం ఏమున్నది? అందరం కలిసికట్టుగా టీమ్‌గా పనిచేస్తున్నం.

గురుకులబాటపై ప్రభుత్వం ఏ విధంగా రాజకీయం చేస్తుందని అంటారు?

రేవంత్‌రెడ్డికి గురుకుల విద్యాలయాలు, ప్రభుత్వ విద్యాలయాల పిల్లలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా బహిరంగ చర్చకు రావాలని నేను బహిరంగ సవాల్ విసురుతున్న. నేను సమగ్ర వివరాల డాటా తీసుకొని వస్తా. రేవంత్‌రెడ్డి కూడా డాటా పట్టుకొని రావాలి. విద్యార్థుల జీవితాలను ఎవరు నిర్మించారు? ఎవరు కాపాడారు? ఎవరు నాశనం చేస్తున్నరో తెలిసిపోద్ది. సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ చర్చకు వచ్చే ధైర్యంలేక, మతిస్థిమితం లేని మంత్రుల చేత ఎందుకు మాట్లాడిస్తున్నరు? సీఎం, మంత్రులు ఎవరైనా పాఠశాలలకు పోయారా? ఎప్పుడన్న పిల్లలతో కలిసి భోజనం చేసిండ్లా? వారి ఇండ్లలకు పోయిండ్లా? వారి కష్టసుఖాలు అర్థం చేసుకున్నరా?

మీ గురుకులబాట సవ్యంగా సాగుతదని అనుకుంటున్నరా? మిమ్మల్ని పోలీసులు వెళ్లనిస్తరా?

తప్పకుండా పూర్తిచేస్తం. ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు అన్నింటినీ పరిశీలిస్తాం. పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేస్తం. పోలీసులను పెట్టి ఎన్నిరోజులు కాపాడుతవు? అసలు విషయాన్ని బయటికి తెలియకుండా ప్రభుత్వం చూస్తున్నది. రేవంత్‌రెడ్డి పోలీసోళ్ల మీద ఆధారపడ్డడు. రేవంత్‌రెడ్డి ఎంత సీఎం అయినా గాలిని ఆపలేరు. నీటిని ఆపలేరు. నిప్పును ఆపలేరు. బీఆర్ఎస్ పార్టీని కూడా ఆపలేరు. మా బిడ్డల ప్రాణాల రక్షణ కోసం, రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మేం ప్రకటించిన కార్యక్రమాన్ని కొనసాగించి తీరుతాం.

లోకం పోకడ

అదిగో..మన పార్టీ గుర్తే.. మనకే మద్దతు!

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	8.1°c	31.8°c
మెదక్	8.9°c	31.9°c
రంగారెడ్డి	10.0°c	33.3°c
నిజామాబాద్	13.5°c	29.5°c
వరంగల్	16.0°c	28.0°c
హైదరాబాద్	17.0°c	31.0°c
మహబూబ్‌నగర్	18.2°c	29.4°c
నల్లగొండ	18.4°c	27.0°c
కరీంనగర్	21.0°c	28.0°c
ఖమ్మం	23.0°c	30.0°c

7 జిల్లాల్లో 10 డిగ్రీల్లోపే ఉష్ణోగ్రతలు

న్యాల్‌కల్‌లో 7.9, సిర్పూర్ (యూ)లో 8.1 డిగ్రీలే

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తేతెలంగాణ) : తెలంగాణలో చలితీవ్రత క్రమంగా పెరుగుతున్నది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సంగారెడ్డి, మెదక్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో 10 రోజులుగా సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఆయా చోట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 10 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవ్వగా, 20 జిల్లాల్లో 15 డిగ్రీల కంటే తక్కువగా, మరో 6 జిల్లాల్లో 19 డిగ్రీల కంటే తక్కువగా నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 7.9 డిగ్రీలు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో 8.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ (టీ) 8.2 డిగ్రీలు, మెదక్ జిల్లా శివంపేట 8.9, నిజామాబాద్ జిల్లా కోటగిరి 9.7 డిగ్రీలు, కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో 9.7 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మార్పల్లెలో 10 డిగ్రీలు నమోదైంది.

బంగాళాఖాతంలో వాయుగుండం

నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతున్నదని, గంటకు 8 కి.మీ వేగంతో కదులుతున్నదని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ప్రస్తుతానికి ట్రింకోమలీకి 270కి.మీ, నాగపట్నానికి 300, పుదుచ్చేరికి 340, చెన్నైకి 380 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నదని తుఫాన్‌గా బలపడే అవకాశం ఉన్నదని వివరించారు. శనివారం మధ్యాహ్నం ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల సమీపంలో కారైకాల్, మహాబలిపురం మధ్య పుదుచ్చేరి దగ్గరలో తుఫాన్‌గా తీరం దాటే అవకాశం ఉందని, ఈ ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంట బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు.

నాణ్యమైన భోజనంలేక పస్తులే దిక్కు

- ఈ విద్యాసంవత్సరం నుంచి వసతులేమి
- పాముల భయంతో నిద్రపోతలేం
- ముజాహిద్‌పూర్ మాడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థినుల ఆవేదన
- సందర్శించిన డీఈవో, తహసీల్దార్

ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ విద్యార్థుల సమస్యలను డీఈవోకు ఫోన్ ద్వారా వివరిస్తున్న తహసీల్దార్

కులకచర్ల, నవంబర్ 29 : 'నాణ్యమైన భోజనం అందక పస్తులు ఉంటున్నాం.. మా గోడు చెప్పుకోవాలంటే బయటకి వెళ్లలేని పరిస్థితి. మీడియాకు చెబుదామన్నా వారిని హాస్టల్‌లోకి అనుమతించరు. మా సమస్యను ఎవరు తీరుస్తారు' అంటూ వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్ మాడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో సుమారు 30 మంది విద్యార్థులు ఉంటున్నారు. వారికి ప్రభుత్వం ద్వారా వివిధ సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. హాస్టల్‌లో బాలికలు మాత్రమే ఉండేలా అన్ని ఏర్పాట్లు చేశారు. వారికి వివిధ రకాలుగా వసతులు కల్పించకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు కొందరు శుక్రవారం ముజాహిద్‌పూర్ మాడల్ స్కూల్‌కు వెళ్లారు. అయితే వారిని లోపలికి అనుమతించక పోవడంతో విద్యార్థులనే బయటకు పిలిపించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీడియా ప్రతినిధులు తహసీల్దార్ మురళీధర్‌కు సమాచారం అందించడంతో వెంటనే ఆయన అక్కడికి చేరుకొని హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. తహసీల్దార్ వెంటనే డీఈవో రేణుకా దేవికి సమాచారం అందించగా.. ఆమె హాస్టల్‌కు చేరుకొని అక్కడి వసతులను పరిశీలించారు. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు రెండు సార్లు మాత్రమే గుడ్లు ఇచ్చారని, మాడిపోయిన భోజనాన్ని అందిస్తున్నారని తెలుసుకున్నారు. పాముల భయంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కరిస్తామని డీఈవో హామీ ఇచ్చారు.

జిన్నారంలో ఇంటి నుంచి తెచ్చుకున్న టిఫిన్ బాక్స్‌లు చూపిస్తున్న విద్యార్థులు

జిన్నారంలో నిలిచిన మధ్యాహ్న భోజనం

ఇంటి నుంచే బాక్స్‌లు తెచ్చుకుంటున్న విద్యార్థులు

మరికల్, నవంబర్ 29 : నారాయణపేట జిల్లా మరికల్ మండలం జిన్నారం ప్రాథమిక పాఠశాలలో నెల రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న వంట ఏజెన్సీకి బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజనం నిలిపివేశారు. దీంతో నెల రోజులుగా విద్యార్థులు ఇండ్ల నుంచే భోజనాలు తెచ్చుకుంటున్నారు. శుక్రవారం పాఠశాలను సందర్శించిన విలేకరుల బృందానికి విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న బాక్సుల్లో భోజనం చేయడం కనిపించి ఈ విషయంపై హెచ్ఎం జ్యోతిని వివరణ కోరారు. మధ్యాహ్న భోజనం చేయడానికి ఏజెన్సీలు ముందుకు రావడం లేదని, విద్యార్థులు పస్తులుండరాదనే ఉద్దేశంతో ఇంటినుంచే బాక్సులు తెచుకోమని చెప్పామని వివరించారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు వంట ఏజెన్సీలు ముందురాకపోతే అక్షయపాత్రకు మధ్యాహ్న భోజనాన్ని అప్పగించాలని గ్రామస్తులు సూచించారు.

ఆర్ట్స్ కళాశాల వద్ద రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

రోడ్డెక్కిన ఓయూ విద్యార్థులు

బ్రేక్‌ఫాస్ట్ నాణ్యంగా లేదని ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 29: ఒకవైపు రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం అందక ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు చోటుచేసుకుంటుండగా, మరోవైపు ఉస్మానియా యూనివర్సిటీ న్యూ గోదావరి హాస్టల్ విద్యార్థులు బ్రేక్‌ఫాస్ట్ నాణ్యంగా లేదంటూ రోడ్డెక్కారు. శుక్రవారం ఉదయం టిఫిన్ సరిగా లేదని వంట పాత్రలు తీసుకొచ్చి ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించారు. నాసిరకమైన భోజనం, ఇతర సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్పందించిన చీఫ్ వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్ ధర్నా వద్దకు వచ్చి విద్యార్థులతో చర్చించారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

మైలారం పాఠశాలలో పురుగుల అన్నం

ఉండలు కట్టిన బియ్యాన్ని గుర్తించిన గ్రామస్థులు

బల్మూరు, నవంబర్ 29 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొన్ని రోజులుగా మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయి. శుక్రవారం గ్రామస్తులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా.. అన్నంలో పురుగులు ఉండడాన్ని గుర్తించి ఇన్‌చార్జి ఎంఈవో విష్ణుమూర్తికి ఫిర్యాదు చేశారు. తరగతి గదిలో ఉన్న బియ్యం సంచుల్లో ఉండలు కట్టి, పురుగులు ఉండడాన్ని గుర్తించారు. వెంటనే పాఠశాలకు చేరుకున్న ఎంఈవో బియ్యాన్ని, పురుగుల అన్నాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, పురుగుల బియ్యాన్ని వెంటనే మార్చాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

మైలారం పాఠశాలలో ఉండలు కట్టిన బియ్యం

రైతుబంధు ఎప్పుడిస్తరు?

మొదటిపేజీ తరువాయి...

చిగురుమామిడిలో శుక్రవారం జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు చేదు అనుభవం ఎదురైంది. చిగురుమామిడి మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన మంత్రి పొన్నం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభలో మంత్రి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తుండగా చిగురుమామిడికి చెందిన బెజ్జంకి భాగ్యమ్మ లేచి ''సార్.. మాకు రైతు రుణమాఫీ కాలే.. రైతుబంధు రాలే..'' అని తెలిపింది. దీంతో స్పందించిన మంత్రి ''మేం ఇప్పటి వరకు ఇచ్చిన పథకాలకు నువు తల ఊపలేదమ్మా.. వీటిని రేపటి నుంచి ఇస్తాం'' అని సమాధానం దాటవేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను త్వరలో అమలు చేస్తామని చెప్పారు.

రైతుబంధుకు రాంరాం!

మొదటిపేజీ తరువాయి...

గురువారం నిర్వహించిన రైతుపండుగ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎన్ని బాధలున్నాయో ప్రభుత్వానికి కూడా అన్ని సమస్యలున్నాయంటూ ఏకరవుపెట్టారు. సన్న వడ్లకు ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌తో ఒక్కో రైతుకు రూ.12 నుంచి 15వేలు అదనంగా వస్తున్నాయని, కష్టపడే రైతులకే ఫలితం దక్కుతున్నదని, రైతు బంధు కంటే బోనసే బాగుందని రైతులు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. రైతుబంధు ఇవ్వకుండా బోనసే ఇవ్వాలని రైతులు కోరుతున్నారని, రైతులకు ఏది మంచిదో చెబితే ఆ ప్రకారం నిర్ణయం తీసుకుంటామని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలే రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రైతుబంధు పథకానికి ప్రభుత్వం మొత్తంగా తిలోదకాలిచ్చినట్టేనని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మంత్రి వ్యాఖ్యల ప్రకారం బోనస్ లేదంటే, రైతుబంధు ఏదో ఒకటి మాత్రమే అందించాలని నిర్ణయించుకున్నట్టు ఉందని రైతులు భావిస్తున్నారు. కేవలం సన్నవడ్లు పండించే రైతులకు మాత్రమే క్వింటాకు రూ.500 బోనస్ అందివ్వాలని నిర్ణయించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అదికూడా అరకొరగానే అమలు చేస్తున్నది. ఇప్పుడు ఆ బోనస్‌తోనే సరిపెట్టాలని చూస్తున్నట్టు ఉందని రైతులు కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరుగుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా రైతుల నుంచి వడ్లు పూర్తిస్థాయిలో కొనడం లేదు. దళారులు కొంటే రైతులకు బోనస్ అందదు. కాబట్టి రైతులు.. రైతుబంధు, బోనస్ రెండూ కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది.

కాంగ్రెస్ నోట.. పూటకో మాట

బీఆర్ఎస్ ప్రభుత్వం 2018-19 వానాకాలం పంట సమయంలో రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టింది. తొలుత ఎకరానికి పంటకు రూ.4000 చొప్పున రెండు పంటలకు కలిపి రూ.8వేల చొప్పున చెల్లించింది. 2018-19 వానాకాలంలో 50.25లక్షల మంది రైతులకు 5236.29కోట్లను అందజేసింది. ఆ తర్వాత పంటకు రూ.5వేలకు ప్రభుత్వం పెంచింది. అలా మొత్తంగా నిరుడు వానాకాలం వరకు 72817.04కోట్లను రైతులకు ఆర్థిక సాయాన్ని అందజేసింది.

ఇవ్వరు.. ఇవ్వనివ్వరు

నిరుడు యాసంగి సీజన్‌కు కూడా రైతుబంధును విడుదల చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో రైతుబంధు విడుదలకు ఈసీ అనుమతినివ్వలేదు. ఆ తర్వాత అనుమతిచ్చినా వరుసగా బ్యాంకు సెలవులు రావడంతో విడుదల సాధ్యంకాలేదు. క